క్లుప్తంగా

ఉచిత విద్యుత్ ఇవ్వాలని వినతి

అడ్డాకుల: ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ జీఓ 342 ప్రకారం అర్హులైన వారికి ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఇళ్ల విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గతంలో ఈ విషయమై ఎస్ఈని కలిసినా ప్రయోజనం లేదని చెప్పారు. బిల్లులు చెల్లించని వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని అన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గండేడ్: మండలంలోని రెడ్డిపల్లిలో సర్పంచ్ నర్సింహారెడ్డి సోమవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక వాయిదా

మిడ్జిల్: మండల ఎంపీపీ పదవికి ఎన్నికల కమిషన్ సోమవారం ఉదయం 11గంటలకు ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదలైంది. సమయం వరకు కోరం లేని కారణం చేత మంగళవారం ఉదయం 11గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీఓ సాయిలక్ష్మి ప్రకటించారు. సభ్యులందరు హాజరు కావాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

దేవరకద్ర: పట్టణంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనులకు సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. బీసు నర్సింహారెడ్డి రూ. సంజమ్మ రూ.11,116, రవికుమార్ రూ. 11,516, వీరప్రసాద్ రూ. 11,516, బాలాజి రూ.11,116, నర్సింహులు రూ. 11,116, గొని నాగరాజు రూ.18,999, మల్లయ్య రూ.11,116 దేవస్థానంకు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ శివానంద్, గోవర్దన్‌రెడ్డి, బాల్‌రాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా మార్చుదాం

బాలానగర్: మండలాన్ని ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధుల సహకారంతో, అధికారులు మరింత ముందుకు సాగాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులలో భాగంగా సర్పంచ్‌లకు, కార్యాదర్శులకు, టీఏ, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలు ఓడీఎఫ్‌గా గుర్తించబడ్డాయని అయినా ఆయా గ్రామాలలో మలమూత్ర విసర్జన బహిరంగంగా సాగుతుందని పలువురు కార్యాలయాలకు ఫిర్యాదు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రెండవరోజు కేతిరెడ్డిపల్లిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ

అడ్డాకుల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని నిజాలాపూర్ ఎంపీటీసీ సభ్యుడు గోవర్దన్, వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్నయాదవ్ అన్నారు. మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లిలో సోమవారం హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. పేదల కోసం పని చేసే కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో పరదేశి యాదయ్య, జైపాల్ రెడ్డి, బాలయ్య, బాలకృష్ణ, కాశన్న, జంగన్న తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు

భూత్పూర్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 24 మందికి టీబీ పరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌వో రామయ్య చెప్పారు. టీబీ అనుమానితులుగా ఉన్నందున వారికి పరీక్షలు చేశామని, రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి మహ్మద్ రఫిక్, వైద్యాధికారి మహ్మద్ అబ్దుల్ రబ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్కను చంపిన వారిపై ఫిర్యాదు

మిడ్జిల్: మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఉన్న పెంపుడు కుక్కను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి చంపారు. ఈ విషయంపై సోమవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఫ్రిజర్‌లో ఉంచారు. ఈ మేరకు పశువైద్యాధికారి శ్రావణి కుక్కకు పోస్టుమార్టం చేశారు. ఈ సంఘటనలో ఓ బీజేపీ నాయకుడి ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు. కుక్కను బాగా కొట్టడం వలన చనిపోయినట్లు పశు వైద్యాధికారి ప్రాథమిక విచారణలో తెలిపారు.

నిలిచిన రోడ్డు పనులు

- అసంపూర్తిగా రెడ్డిపల్లి–బల్సుర్‌గొండ రోడ్డు
- గడువు పూర్తయిన కానరాని పురోగతి



కంకర వేసి వదిలేసిన రెడ్డిపల్లి బల్సుర్‌గొండ రోడ్డు.

గండేడ్: ఓ వైపు నిధులు లేక అభివృద్ధి పనులు ఆగితే మరోవైపు నిధులున్నా నిర్లక్ష్యం వీడడం లేదు. గడువు ముగిసినా రోడ్డు పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా వదిలేశారు. మండలంలోని భూత్పూర్ – చించోళి జాతీయ రహదారి నుంచి రెడ్డిపల్లి గేటు మీదుగా బల్సుర్‌గొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటుకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.3కోట్ల71 లక్షల60వేలు 2021లో మంజూరయ్యాయి. ఈ నిధులతో 5.8 కిలోమీటర్లు మెటిలింగ్ పనులతో పాటు బీటీ రోడ్డు వేయాలి. అవసరమైన చోట కల్వర్టులు కట్టాలని నిర్దేశించారు. వయా రెడ్డిపల్లి మన్సూర్‌పల్లి, కొండాపూర్‌ను కలుపుతూ బల్సుర్‌గొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రోడ్డు వేయాలని సంకల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ వారు టెండరు దక్కించుకున్నారు. టెండర్ వచ్చాక పనులు నత్తనడకన కొనసాగించారు. తర్వాత బీటీ రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయింది.

కంకర తేలి అధ్వానంగా

2021లో పనులు ప్రారంభం కావాల్సి ఉండగా 2022 ప్రారంభించారు. అవసరమైచోట కల్వర్టులు కట్టారు. తర్వాత జీబీ లేయర్ కంకర వేశారు. దీని తర్వాత డబుల్ ఎంఎం కంకర మరో లేయర్ వేసీ బిటి వేస్తారు. కాని ఒకే లేయర్‌తో పనులు నిలిచిపోయాయి. దీంతో కంకర తేలి అధ్వానంగా తయారైంది. ఈ మార్గం నుంచి పగిడ్యాల్, కోత్లాబాద్, బల్సుర్‌గొండ చెందిన వారు గండేడ్‌కు చేరుకోవాలన్నా చాలా సులభం. ఈ దారి గుండా వెళితే సమయం ఆదా అవడంతో పాటు దాదాపు 15 కిలోమీటర్లకుపైగా దూరం తగ్గుతుంది. అసలే ఎండాకాలం కావడంతో కంకరతో కష్టాలు పడడమే కాక దుమ్మతో ఇబ్బందులో పడేత పరిస్థితి నెలకొంది. గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలనే స్థానికులు కోరుతున్నారు.

గడువు ముగిసినా..

గడువు ముగిసినా రోడ్డు పనులు పూర్తి చేయడం లేదు. 22 జూన్ 2021 నుంచి పనులు ప్రారంభించి 21 డిసెంబర్ 2022 వరకు పూర్తి చేయాలని నిర్దేశించారు. గడువు ముగిసి రెండు నెలలు గడిచిపోయినా పనుల్లో పురోగతి లేదు. మరో లేయర్ వేసీ బీటీ వేయాలంటే దాదాపు మరో మూడు నెలలు పడుతుంది. 21 డిసెంబరు 2022 వరకు నిర్మాణం పూర్తి చేసి, 22 డిసెంబరు 2022 నుంచి 21 డిసెంబరు 2027 వరకు మెయింటెనెన్స్ చేయాలని పేర్కొన్నారు. దీనికి గాను రూ.24.38 లక్షలు నిధులు కేటాయించారు.

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



సంవత్సరం నుంచి ఈ రోడ్డు గుండా వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కల్వర్టులు కట్టేటప్పుడు, కంకర వేసేటప్పుడు కూడా ఎన్నో పాట్లు పడ్డాం. కంకర తేలి ఉండడంతో బైక్‌పై వెళ్లాలంటే భయంగా ఉండేది. ముఖ్యంగా దుమ్ముతో కళ్లు పాడవుతున్నాయి. పాఠశాల విద్యార్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

– దోమ లక్ష్మణ్, ఉపాధ్యాయుడు

అధికారులు స్పందించాలి..



మండల కేంద్రంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నా. మా ఊరు బల్సుర్‌గొండ నుంచి ఇక్కడికి రావాలంటే రెడ్డిపల్లి మీదుగా దగ్గరవుతుంది. మేము ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రోడ్డే అనుకూలం. రోడ్డు పూర్తి కాకపోవడంతో కష్టాలు పడుతున్నాం. దీనికంటే గతంలో ఉన్న మట్టి రోడ్డే మేలనిపిస్తుంది.

– శ్రీనివాస్, బల్సుర్‌గొండ

మూడు నెలల్లో పూర్తి చేయిస్తాం..

ఇప్పటికే బీటీ రోడ్డు పూర్తి కావాల్సింది. కాని చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదు. దీంతో అతను మిగతా పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. పీఎంజీఎస్‌వై పనులన్నింటికీ కూడా బిల్లులు చెల్లించలేదు. కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు జీబీ లేయర్ మెటలింగ్ అయ్యింది. వర్షాకాలం రాకముందే మరో మూడు నెలల్లో డబుల్ ఎంఎం లేయర్ వేసి బీటీ రోడ్డును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– సురేష్, పంచాయతీరాజ్ ఏఈ, హన్వాడ

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విద్యుత్ ఉద్యోగులు చేపడుతున్న నిరసన కార్యక్రమం మూడో రోజు సోమవారం కొనసాగింది. డివిజన్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసనలో పాల్గొన్నారు. ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ చంద్రమౌళి మాట్లాడుతూ.. డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించే వరకు దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఉద్యోగులకు ఈపీఎఫ్, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 24న మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మీటర్ రీడింగ్ కార్మికులను గుర్తించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కార్మికులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్‌శాఖలో మీటర్ రీడింగ్ కార్మికులుగా పని చేస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలుగౌడ్ కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ థర్డ్ పార్టీ కార్మికుల వివరాలను సేకరిస్తుందని తెలిపారు. వారిలాగానే తాము విద్యుత్‌శాఖ లో 23 ఏళ్లుగా పని చేస్తున్నామని తమ వివరాలను కూడా సేకరించి గుర్తించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2వేలు, జిల్లాలో 180 మంది వరకు పని చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో శరత్‌కుమార్, రామలింగం, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌వీఎం హాలులో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో అన్ని మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాస పోటీల్లో లావణ్య, శ్రీవిద్య, అర్చన, వ్యాసరచన పోటీల్లో రుచిత, అకింత, రంగోళి పోటీల్లో మౌనిక, దేవేందర్‌గౌడ్, నవనీత వరుసగా మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



పరిశీలిస్తున్న ఎస్ఐ విజయకుమార్

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. అడ్డాకుల ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శాంతన్నగౌడ్ తన కుటుంబంతో కలిసి శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉండే బంధువుల వద్దకు వెళ్లాడు. దొంగలు తలుపు విరగొట్టి ఇంట్లోకి వెళ్లారు. బీరువాలో ఉన్న రూ.20వేల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చిన శాంతన్న తన ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్యాణ రథోత్సవం బ్రోచర్ విడుదల

హన్వాడ: మండలంలోని మాధారం తిరుమలనాథ స్వామి వారి కల్యాణ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా బ్రోచర్లను విడుదల చేశారు. మార్చి 5 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌గౌడ్, రమణారెడ్డి, అనంత్‌రెడ్డి, రామలింగం, బాలకిష్టయ్య, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటరమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలి



మహమ్మదాబాద్‌లో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో చదువుతున్న ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ర్యాగింగ్ పేరుతో వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని లంబాడ ఐక్యవేదిక జడ్చర్లలో రాస్తారోకో చేపట్టారు. హన్వాడలో గోర్ బంజారా ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. పలువురు కొవ్వొత్తులతో ఆమె మృతికి నివాళులు అర్పించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ర్యాగింగ్ భూతాన్ని రూపుమాపాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



జడ్చర్లలో కొవ్వొత్తులతో నివాళి



హన్వాడలో ఆందోళన చేస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో నివాళులు అర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



జడ్చర్లలో రాస్తారోకో చేస్తున్న లంబాడ ఐక్యవేదిక నాయకులు



మహబూబ్‌నగర్‌లో కొవ్వొత్తులతో ప్రీతికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రమాదాల నివారణకు కృషిచేద్దాం

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల/బాలానగర్: జిల్లాలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఎస్పీ నర్సింహ అన్నారు. అడ్డాకుల, మూసాపేట, బాలానగర్, రాజాపూర్ మండలాల్లో విస్తరించి ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకునే ప్రదేశాలను సోమవారం ఆయన ఎల్‌అండ్‌టీ అధికారులతో కలిసి పరిశీలించారు. అడ్డాకులలోని కాటవరం స్టేజీ, గుడిబండ, కందూర్ స్టేజీ, మూసాపేట మండలంలోని వేముల స్టేజీ, చక్రాపూర్ స్టేజీ వద్ద ఇటీవల ప్రమాదాల ప్రదేశాలను ఆయన తనిఖీ చేశారు. బాలానగర్, రాజాపూర్ మండలాల పరిధిలోని ముదిరెడ్డిపల్లి, రాజాపూర్, రంగారెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి, పెద్దాయపల్లి, బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలిని పరిశీలించారు. ప్రమాదాల వివరాలను తెలుసుకుని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రహదారి నిర్వాహణ అధికారులతో చర్చించారు. జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అవసరమైన చోట ఎస్ టైప్ జిగ్‌జాగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు అయినప్పుడు ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రద్దీని అరికట్టాలని, అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఎంతటి వారైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. హైవేపై నిలిపే భారీ వాహనాలతో పలు ప్రాంతాలలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనాల నిలుపుదలను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐ రజితారెడ్డి, ఎస్ఐలు విజయకుమార్, నరేష్, విజయభాస్కర్, ఎల్‌అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ మదన్‌మోహన్, ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్ తదితరులు ఉన్నారు.



మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ్మా, డీఎస్పీ మహేష్

డేంజర్ స్పాట్స్ పరిశీలన



పాత పాలమూరు వద్ద పరిశీలిస్తున్న సీఐలు

పాలమూరు: పోలీస్ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్–జడ్చర్ల రోడ్డు మార్గంతో పాటు మహబూబ్‌నగర్ –దేవరకద్ర ప్రధాన రోడ్డు మార్గంలో ప్రమాదకర ప్రాంతాలను సోమవారం పట్టణ సీఐలు స్వామిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, అశోక్‌గౌడ్, ఎంవీఐ నరేష్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట, పాత పాలమూరు మలుపు దగ్గర, బిస్లారి గేట్, ఓబ్లాయిపల్లి, ధర్మాపూర్ టర్నింగ్ దగ్గర సీఐల బృందం రోడ్డును పరిశీలించారు. ప్రధానంగా ప్రమాదాలు చోటు చేసుకునే కారణాలపై విశ్లేషించారు. గుర్తించిన వాటిలో రేడియం స్టిక్కర్స్ లేకపోవడం, రోడ్డు ఎగుడుదిగుడు ఉండటం, లైట్లే లేకపోవడం, డివైడర్, స్పీడ్ బ్రేకర్స్, పట్టణంలో ఎడమవైపు ప్రహరీ గోడలు ఉండటం గుర్తించారు. సీఐలు తయారు చేసిన ప్రత్యేక నివేదికను పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు పంపనున్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

బాలానగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరంచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని నేరళ్లపల్లి శక్తి కేంద్రం వద్ద మాట్లాడారు. ప్రజాగోస–బీజేపీ యాత్రలో పలు విషయాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని అన్నారు. అందుకు బూత్ లెవల్ నుంచి కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింహులు, సామ్యానాయక్, అవినాష్, శ్రీశైలం, సురేష్ నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూములు తీసుకుని.. ఉద్యోగాలు ఇవ్వలేదు

భూత్పూర్: కర్వెన ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, భూమికి భూమి ఇస్తానని సీఎం కేసీఆర్ చెప్పి మాట తప్పారని బీజేపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కర్వెనలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రాంరెడ్డి అధ్యక్షతన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

దేవరకద్ర: కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబీలో ముంచిందని బీజేపీ పాలమూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం రాత్రి మండలంలోని డోకూర్‌లో 133, 134, 137 శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నారని విమర్శించారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపించాలి



మిడ్జిల్‌లో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పర్యటించి టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావద్దని కోరారు. ఆయన వెంట కిష్టయ్య, వెంకటేష్, రవికుమార్, నర్సింహులు, నరేష్, కృష్ణ, శంకర్‌బాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

మిడ్జిల్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో టీఎస్‌యూటీఎఫ్ మద్దతుతో పోటీ చేస్తున్న మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు



చౌలతండాలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భూత్పూర్: మండలంలోని చౌలతండా, మద్దిగట్లలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలు సోమవారం ముగిశాయని సీహెచ్‌వో బొర్ర రామయ్య తెలిపారు. చౌలతండా మూడురోజుల పాటు 363 మందికి కంటి పరీక్షలు చేయగా 30 మందికి అద్దాలు పంపిణీ చేయగా, 51మందికి కంటి అద్దాలు రావాల్సి ఉంది. 54 మందిని ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. మద్దిగట్లలో వారం రోజుల పాటు 929 మందికి పరీక్షలు, 192 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 280 మంది అద్దాలు రావాల్సి ఉండగా, 263 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు సీహెచ్‌వో చెప్పారు.

290 మందికి కంటి పరీక్షలు..

గండేడ్: మండలంలో సోమవారం 290 మందికి కంటి పరీక్షలు చేశారు. మండలంలోని జక్లపల్లి, రెడ్డిపల్లిలో శిబిరాలు కొనసాగుతున్నాయి. 42 మందికి రీడింగ్ అద్దాలు ఇవ్వగా, 59 మందికి రెఫర్ చేసిన కంటి అద్దాలు ఇచ్చారు. కంటి వెలుగు శిబిరాలను వైద్యాధికారి చంద్రశేఖర్ పరిశీలించారు.

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌లో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించినట్లు మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఈ గ్రామంలో వారం రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని ప్రజలంతా అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.